సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 23 । ఆగస్టు । 2023



మళ్లీ పెరిగిన గోదావరి

గోదావరికి స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. కుక్కునూరు–దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు వంతెన ముంపునకు గురైంది. IIలో ▸



కోడి వ్యర్థాలు సీజ్

కొల్లేరులోని చేపల చెరువులకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి వీటిని సేకరించినట్లు తెలిపారు. IIలో ▸



పేదలకు ఉన్నత విద్యే లక్ష్యం

పేదలకు ఉన్నత విద్యే సీఎం లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. నిడమర్రు మండలంలో నాడు–నేడు పనులు ఆమె ప్రారంభించారు. IIలో ▸

న్యూస్‌రీల్

గృహ నిర్మాణ శాఖ పీడీగా ఆనంద్ కుమార్



కలెక్టర్ ప్రశాంతిని కలిసిన గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్ కుమార్

భీమవరం(ప్రకాశంచౌక్): పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న ఆర్‌సి ఆనంద్ కుమార్‌ను డిప్యుటేషన్‌పై జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ షా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విధుల్లో చేరారు. స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.

వచ్చే నెల 7న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

8న క్షేత్రంలో ఉట్ల పండుగ



సప్తగోకులంలోని శ్రీకృష్ణుడు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వచ్చేనెల 7న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఆ రోజు ఆలయంలో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు చెప్పారు. 8న సాయంత్రం క్షేత్రంలో ఉట్ల పండుగను, శ్రీవారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామని, భక్తులు పెద్ద ఎత్తున ఈ వేడుకల్లో పాల్గొనాలని ఈఓ కోరారు.

కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తే చర్యలు

సాక్షి, భీమవరం: సంస్థలు, దుకాణాలు, హోటళ్లు, పరిశ్రమల్లో 18 ఏళ్లు నిండిన వారిని మాత్రమే పనిలో నియమించుకోవాలని జిల్లా ఇన్‌చార్జి లేబర్ ఆఫీసర్ ఆకన లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం –1976 నిబంధనల్ని ఉల్లంఘించిన యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రోజుకు 8 గంటల పని సమయం, వారాంతపు సెలవు, శుభ్రమైన తాగునీరు, టాయిలెట్ సౌకర్యాలు కల్పించాలన్నారు.

నెలాఖరు వరకు పలు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): గుణదల–విజయవాడ సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈ నెల 22 నుంచి 30 వరకూ ఏలూరు మీదుగా నడిచే పలు రైళ్లు రద్దు చేసినట్లు స్టేషన్ మేనేజర్ ఎన్వీ రమేష్ తెలిపారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 52 రైళ్లు పూర్తిగా, మరో 18 రైళ్లు పాక్షికంగా రద్దు చేసినట్లు చెప్పారు. పూర్తిగా, పాక్షికంగా రద్దుచేసిన రైళ్ళల్లో 50 సర్వీసుల వరకూ ఏలూరు మీదుగా రాకపోకలు సాగించేవి ఉన్నట్లు తెలిపారు. వీటిలో ప్రధానంగా విశాఖపట్టణం–సికింద్రాబాద్‌కు రాకపోకలు సాగించే రైళ్లతో పాటు జన్మభూమి, గరీబ్‌రథ్ వంటి పలు రైళ్లు ఉన్నాయి. ముందుగా రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు దీన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.

ప్రశాంతంగా హార్టీ సెట్

తాడేపల్లిగూడెం: వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఎనిమిది ఉద్యాన కళాశాలల్లో బీఎస్సీ హార్టీ కల్చర్ డిగ్రీ కోర్సులో ప్రవేశానికి మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీలో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విశ్వవిద్యాలయం పరిధిలోని 11 ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు రాష్ట్రంలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష రాశారు. హార్టీసెట్ 2023 ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుగుణంగా కోర్సులో ప్రవేశం ఉంటుంది. ఈ కోర్సులో మొత్తం 92 సీట్లు ఉన్నాయి. నాలుగు ప్రభుత్వ ఉద్యాన కళాశాలల్లో 52 సీట్లు, ప్రైవేటు ఉద్యాన కళాశాలల్లో 40 సీట్ల కోసం రాసిన పరీక్షకు 373 మంది హాజరయ్యారు. ఉపకులపతి డాక్టర్ తోలేటి జానకీరామ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ.స్వామి, డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్.పద్మావతమ్మలు పర్యవేక్షించారు.

ఆహా క్యాంటీన్‌లు

- ఉమ్మడి జిల్లాలోని 8 పట్టణాల్లో ఏర్పాటు
- స్వయం సహాయక గ్రూపుల ఆధ్వర్యంలో నిర్వహణ
- తక్కువ ధరకు రుచి, శుచిగా ఆహారం



జంగారెడ్డిగూడెం: పట్టణాల్లో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వం ఆహా క్యాంటీన్‌లు ప్రారంభిస్తోంది. ప్రజలకు తక్కువ ధరకే రుచికరమైన ఆహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వాసుపత్రికి వచ్చేవారికి, మార్కెట్‌కు వచ్చే రైతులు, వ్యాపారులకు, రద్దీ ఎక్కువగా ఉండే బస్టాండ్ వంటి ప్రాంతాల్లోని ప్రజల ఆకలి తీర్చేందుకు మెప్మా నడుం బిగించింది. ఇప్పటికే జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మహిళా మార్టులు ఏర్పాటు చేసి సమాఖ్య సభ్యులతో విజయవంతంగా నడిపిస్తుంది పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా). ఇప్పుడు మరింత మంది పట్టణ మహిళా సమాఖ్య సభ్యులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో 'ఆహా' క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు.

రూ. 13 వేల చొప్పున ఆర్థిక సాయం

యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉండి ముందుకు వచ్చే మహిళా సమాఖ్య సభ్యులతో ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా సాధారణ ప్రజలు అధికంగా తిరిగే ప్రభుత్వాసుపత్రులు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, మార్కెట్‌లు, మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో సాధ్యమైనంత ఎక్కువమందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో మెప్మా కృషిచేస్తోంది. ఆహా క్యాంటీన్ల యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చే సంఘ సభ్యులకు రూ.13 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ఎక్కడ ఏర్పాటు చేసేది ముందుగానే నిర్ణయించి, ఆయా ప్రాంతాలకు సంబంధించిన సంస్థల అధికారులతో ఇప్పటికే అనుమతులు తీసుకున్నారు.

ఇంటి వద్దే వండి ఎంపిక చేసిన చోట్ల విక్రయం

ఆహారాన్ని రుచిగా, శుచిగా ఇంటి వద్దే వండి, ఎంపిక చేసిన ప్రాంతాల్లో కియోస్కోల్లో విక్రయిస్తారు. ఆయా ప్రాంతాల డిమాండ్ అవసరాల్ని బట్టి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు విక్రయించే ఏర్పాటు చేస్తున్నారు. భోజనం మార్కెట్ ధరకన్నా తక్కువకు విక్రయించేలా, రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆహా క్యాంటీన్లు ఏర్పాటు చేసే ప్రాంతాలు

పట్టణం	ఏరియా
ఏలూరు	తంగెళ్లమూడి
జంగారెడ్డిగూడెం	బుట్టాయగూడెం రోడ్ గాంధీ బొమ్మ సెంటర్
నూజివీడు	బస్టాండ్ సెంటర్
పాలకొల్లు	ఎల్ అండ్ టీ టిడ్కో హౌస్‌లు
తాడేపల్లిగూడెం	శేషమహల్ సెంటర్
నరసాపురం	స్టేషన్ పేట
భీమవరం	గునుపూడి స్ట్రీట్ శివాలయం వద్ద
తణుకు	ఉండ్రాజవరం జంక్షన్

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 8 పట్టణాల్లో ఆహా క్యాంటీన్‌లు ఒక వారంలో ప్రారంభిస్తున్నాం. ఆకివీడులో సెకండ్ ఫేజ్‌లో ప్రారంభిస్తాం. చింతలపూడి పట్టణం ఇంకా మెప్మా పరిధిలోకి రాలేదు. వచ్చిన తరువాత అక్కడ కూడా ఏర్పాటు చేస్తాం.

– బి.ఇమ్మానుయేల్, పీడీ, మెప్మా

బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో చొరవ చూపాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): వైఎస్సార్ బీమా నమోదు,క్లెయిమ్‌లు అప్‌లోడ్ చేయడంలో అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరంలోని కలెక్టరేట్‌లో వైఎస్సార్ బీమా పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా నమోదు జిల్లాలో 97 శాతం పూర్తయిందని, మిగిలిన 3 శాతం పెండింగ్‌కు కారణాలను తెలుసుకొని నూరు శాతం నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నో పాలసీ పిరియడ్‌లో అందిన 2,875 దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వానికి లేఖ రాయాలని డీఎల్‌డీఓ, కార్మిక శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. క్లెయిమ్‌లు రిజిస్ట్రేషన్ చేయడం, అప్‌లోడ్ చేయడం సహజ మరణమైతే ఏడు రోజులు, ప్రమాదవశాత్తు అయితే 14 రోజుల లోపు నిర్ణీత గడువులోగా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్. వేణుగోపాల్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి పాల్గొన్నారు.

రీ సర్వే ప్రణాళికా బద్ధంగా సాగాలి



వర్క్ షాపులో మాట్లాడుతున్న జేసీ

పాలకొల్లు సెంట్రల్: భూ రీసర్వేలో భాగస్వాములైన వారంతా కలిసికట్టుగా ప్రణాళికా బద్ధంగా పూర్తి అవగాహనతో పని చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జగనన్న శాస్వత భూ హక్కు, భూ రక్ష పథకంపై నరసాపురం రెవెన్యూ డివిజన్‌కు చెందిన పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బందికి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రామసుందర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన సర్వే చేయాలన్నారు. రీ సర్వేలో రైతులు భాగస్వాములుగా ఉండాలని వారికి ఎంత అవగాహన కలిగితే సర్వే అంత బాగా జరుగుతుందన్నారు. సర్వే చేసే సమయంలో ముందుగా సంబంధింత రైతులకు, భూ యజమానులకు నోటీసులు అందజేయాలన్నారు. ప్రభుత్వ భూములకు గతంలో ఉన్న సరిహద్దులనే పరిగణలోకి తీసుకోవాలన్నారు. పట్టా భూముల్లో ఎవరు ఎంజాయ్‌మెంట్‌లో ఉన్నారో సరిచూసుకోవాలన్నారు. సుమారు 100 సంవత్సరాల క్రితం బ్రిటిష్ పాలనలో భూ సర్వే జరిగిందని.. నాడు గొలుసు సర్వే చేయడంతో 5 శాతం తేడాతో సర్వేలు పూర్తి చేశారన్నారు. నేడు శాటిలైట్ బేస్‌తో సర్వే చేస్తున్నట్లు చెప్పారు. నరసాపురం డివిజన్‌లో రీ సర్వే డ్రోన్ ఫ్లై పూర్తయ్యిందన్నారు. దీనిపై రెవెన్యూ సిబ్బందికి ఇప్పటికే రెండు సార్లు ట్రైనింగ్ ఇచ్చామన్నారు. జిల్లాలో 318 రెవెన్యూ గ్రామాలకు 140 గ్రామాలకు ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్) వచ్చాయని.. రీ సర్వే మొదటి ఫేజ్‌లో 12, రెండో ఫేజ్‌లో 54 గ్రామాలు పూర్తయ్యిందని తెలిపారు. మిగిలిన రెవెన్యూ గ్రామాల్లో కూడా రీసర్వే రెండు నెలల్లో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో సర్వే అధికారి కె.జాషువా, పాలకొల్లు, పోడూరు, యలమంచిలి తహసీల్దార్‌లు సీహెచ్ పెద్దిరాజు, ఆర్వీ కృష్ణారావు, ఎం.సునీల్‌కుమార్, మండల సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం మండలంలో..

ఇరగవరం: రీ సర్వేలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు, సర్వేయర్లు, వీర్వోలు, సర్వే సబ్బందితో రీ సర్వేపై సమీక్షించారు. రీ సర్వేలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీంలు ముందుకు సాగే సులువైన పద్ధతులను వివరించారు.

మౌలిక వసతుల ఏర్పాటు వేగవంతం చేయాలి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): పేదల ఇళ్ల కాలనీల్లో మౌలిక వసతులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరంలోని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తయిన జగనన్న కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులు త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి కాకినాడ జిల్లా సామర్లకోటలో జగనన్న కాలనీని ప్రారంభించనున్నారని, అదేవిధంగా దువ్వ లేఅవుట్‌లోని గృహాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలతో పాటు అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, విద్యుదీకరణ, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలనీలకు స్వాగత ద్వారాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కొన్ని లేఅవుట్ అప్రోచ్ రోడ్లకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చామని.. వాటి పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో హార్టికల్చర్ కింద మంజూరు చేసిన పనులన్నీ ప్రారంభించి రేపు సాయంత్రానికి రిపోర్ట్ అందించాలన్నారు. నాడు నేడు పెండింగ్ పనులన్నీ వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు సంబంధించిన పనులను వెంటనే మొదలుపెట్టి పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ అధికారి డాక్టర్ ఆర్.సి ఆనంద్ కుమార్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీలపై సమీక్ష

సాక్షి, భీమవరం: ఇంటర్ స్థాయి నుంచే డిగ్రీ కోర్సుల పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం భీమవరంలోని కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపల్స్‌తో కాంట్రాక్టు లెక్చర్ల బదిలీలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ పూర్తయిన తర్వాత ఏ కోర్సులు చదివితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే వాటిని ఇంటర్మీడియట్ స్థాయి నుంచే వారికి అవగాహన కల్పించాలన్నారు. సరైన అవగాహన లేక ఎవరో ఒకరిని అనుకరిస్తే ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ స్థాయి వరకు పాఠ్యాంశాలను విపులీకరించి చెప్పేందుకు ఉపాధ్యాయులుగా శిక్షణ పొందిన లెక్చరర్లు అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశలోనే సరైన దిశా నిర్దేశం చేస్తేనే విద్యార్థులు భవిష్యత్తులో రాణించగలుగుతారని, ఇలాంటి గురుతరమైన బాధ్యత మీపై ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న 26 మంది కాంట్రాక్టు లెక్చరర్లలో ఒకే కాలేజీలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని నిబంధనల మేరకు తప్పనిసరిగా బదిలీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రి తనిఖీ



మందుల దుకాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

తణుకు అర్బన్: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులందరికీ సత్వర సేవలు అందించాలని, ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ వైద్యులను ఆదేశించారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా ఆస్పత్రిలో గత కొంతకాలంగా అనధికార సెలవుల్లో కొనసాగుతున్న ఐదుగురు వైద్యుల తీరుపై సీరియస్ అయినట్లు తెలుస్తోంది. నెలల తరబడి సమాచారం ఇవ్వకుండా వైద్య సేవలకు డుమ్మాకొడుతున్న వైనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే విధులకు హాజరవుతారా? లేదా అనే విషయాన్ని తెలుసుకోవాలని ఆదేశించడంతో పాటు తాను కూడా సదరు వైద్యులతో నేరుగా మాట్లాడతానని అన్నారు. ఆస్పత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేయాలని ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ వెలగల అరుణ కోరగా వెంటనే ఏర్పాటు చేయిస్తానంటూ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణలోని జనరిక్ మందుల దుకాణాన్ని పరిశీలించారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ విధానం

కైకలూరు నియోజకవర్గ సమీక్షలో ఇన్‌చార్జ్ మంత్రి విశ్వరూప్

ఏలూరు(మెట్రో): పేద ప్రజలకు మంచి జరగడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం కైకలూరు శాసనసభ నియోజకవర్గంలో అమలు జరుగుతున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తదితరులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టి కృషితో బాధ్యతాయుత పాలన అందిస్తున్నారన్నారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వాటిని అర్హులైన పేదలందరికీ అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కైకలూరు నియోజకవర్గంలో మంజూరైన 79 గ్రామ సచివాలయ భవనాలు, 45 రైతు భరోసా కేంద్రాలు, 57 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనుల్లో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని మిగిలిన వాటిని సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.

దయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో అంబేడ్కర్ భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అలాగే కైకలూరు సీహెచ్‌సీలో దయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 27 సొసైటీలకు కమిషన్ విడుదల చేయాలని గుర్తు చేశారు. ఎస్సీ ఏరియాల్లో శ్మశాన వాటికలకు భూమి కేటాయించాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ స్థలాలు

- తాడేపల్లిగూడెం, మార్టేరులో నెలకు రూ 8.53 లక్షల అద్దె
- భీమవరంలో 1.25 సెంట్లు భూమి లీజుకు ఇచ్చేందుకు ఏర్పాట్లు



భీమవరం ఆర్టీసీ డిపో వద్ద అద్దెకు ఇచ్చిన షాపులు

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమ ఆర్టీసీ అదనపు ఆదాయం లక్ష్యంగా ముందుకు సాగుతుంది. కార్గో ద్వారా అదనపు ఆదాయం అందుకుంటున్న ఆర్టీసీ ఇప్పటికే జిల్లాలో పలు చోట్ల ఆర్టీసీ డిపోల వద్ద ఖాళీ స్థలాల్లో షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతుంది.

తాడేపల్లిగూడెం, మార్టేరులో స్థలాలు అద్దెకు

జిల్లాలో తాడేపల్లిగూడెం, మార్టేరులో ఆర్టీసీకి ఉన్న స్థలాలను నెలవారీ అద్దె ప్రాతిపాదికన 2 ఎకరాల 72 సెంట్లను రూ. 8.53 లక్షల అద్దెకు ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో ఖాళీ స్థలం ఎకరం 27 సెంట్లు కాగా అందులో 41 సెంట్లను రూ 4.59 లక్షలకు.. మిగిలిన 86 సెంట్లను రూ.2.86 లక్షలకు అద్దెకు ఇచ్చారు. ఈ స్థలాల్లో రెండు షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేయనున్నారు. మార్టేరులో ఆర్టీసీకి ఎకరం 45 సెంట్ల భూమి ఉంది. అందులో ఎకరం 15 సెంట్లు నెలకి రూ.90 వేల చొప్పున కల్యాణ మండపానికి అద్దెకు ఇచ్చారు. 5 ఏళ్లకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ ఖాళీ స్థలాల ద్వారా నెలకి రూ 8.53 లక్షల చొప్పున ఏడాదికి రూ 1.23 కోట్ల ఆదాయం లభించనుంది.

షాపుల ద్వారా రూ.1.23 లక్షల ఆదాయం

జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరం డిపోల వద్ద ఖాళీ స్థలంలో సుమారు ఏడాది క్రితం షాపులు నిర్మించి నెలవారి అద్దె ప్రాతిపదికన వేలం ద్వారా అద్దెకు ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో 10 షాపులు ఉండగా వాటి ద్వారా నెలకి రూ.లక్ష, భీమవరంలో 4 షాపుల ద్వారా రూ.23,495 ఆదాయం లభిస్తుంది. భీమవరం ఆర్టీసీ డిపోకు చెందిన ఎకరం 25 సెంట్ల భూమిలో ప్రస్తుతం ఆర్టీసీ క్వార్టర్స్ ఉన్నాయి. ఈ స్థలాన్ని కూడా అద్దెకు ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

నెలవారీ అద్దె ప్రాతిపదికన ఇచ్చాం



తాడేపల్లిగూడెం, మార్టేరులోని ఆర్టీసీకి ఉన్న ఖాళీ స్థలాలను నెలవారీ అద్దె ప్రాతిపదికన ఇచ్చాం. లీజుకు ఇవ్వడం, అగ్రిమెంట్ కూడా పూర్తి చేశాం. ఆర్టీసీ స్థలాలను అద్దెకు ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం వస్తుంది. భీమవరంలో ఉన్న స్థలాన్ని కూడా అద్దెకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎ.వీరయ్య చౌదరి, జిల్లా ప్రజారవాణా అధికారి, భీమవరం

చరిత్రలో నిలిచే ఆవిష్కరణలు చేపట్టాలి



నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే

తాడేపల్లిగూడెం: దేశ భవిష్యత్ యువతరానిదే అని, చరిత్రలో నిలిచే ఆవిష్కరణల రూపకల్పనకు విద్యార్థులు పాటుపడాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎం.ప్రమోద్ పడోలే కోరారు. నిట్‌లోని బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం జరిగింది. వర్చువల్‌గా ఇన్‌చార్జి డైరెక్టర్ మాట్లాడుతూ కాలయాపన చేయకుండా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఆధునిక సాంకేతికత నైపుణ్యాలపై పట్టు సాధిస్తే, చాలామందికి మార్గదర్శకులై ఖ్యాతి పొందుతారన్నారు. తాత్కాలిక ఆనందాలకు విద్యార్థి దశలో లొంగిపోతే వారి భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. పట్టుదల, సంకల్పం, సద్బుద్ధి విద్యార్థులకు ఉంటే లక్ష్యాలను సాధించగలరన్నారు. రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక పురోగతి, విద్యార్థులు చేపట్టే కొత్త పరిశోధనలతో దేశం గర్విస్తుందన్నారు. వినూత్న ఆలోచనలే ప్రపంచ స్వరూపాన్ని మారుస్తాయని, విద్యార్థుల ఆలోచనలు ఈ క్రమంలో సాగాలన్నారు. జీవితాల్లో వెలుగుల కోసం విద్యాలయాల్లో నేర్చుకున్న పరిజ్ఞానాన్ని అన్వయించుకోవాలన్నారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, తమ బంగారు భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని డీన్‌లు డాక్టర్ జీబి.వీరేష్‌కుమార్, కార్తీక్ శేషాద్రి, ఎస్.జయరామ్‌లు అన్నారు. నిట్‌లో మొత్తం 480 సీట్లకు ఇప్పటి వరకు 463 మంది విద్యార్థులు రిపోర్టు చేశారన్నారు. ఇండక్షన్ కార్యక్రమం ఈ నెల 26 వరకు జరుగుతుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు గడువు పొడిగింపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తుకు గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పీ శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి అవార్డుకు అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను ఈ నెల 24 మధ్యాహ్నం ఒంటిగంట లోపు సంబంధిత తనిఖీ అధికారి ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపాలని సూచించారు. 24వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తరువాత వచ్చే దరఖాస్తులు స్వీకరించరన్నారు. కనీసం 15 సంవత్సరాల సేవా కాలం పూర్తి చేసిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, టీచర్ ఎడ్యుకేటర్లు ఈ అవార్డులకు అర్హులన్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులు గతంలో జిల్లా స్థాయి అవార్డులు పొంది ఉండాలని, గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు పొందిన వారు దరఖాస్తు చేయడానికి అనర్హులని వివరించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు మండల స్థాయి కమిటీ ద్వారా, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డివిజన్ స్థాయి కమిటీ ద్వారా సమర్పించాలని సూచించారు.

గోదావరికి మళ్లీ పెరిగిన వరద



వరద నీటికి మునిగిన గుండేటి వాగు వంతెన



గోదావరి వరదకు మునిగిన ఎద్దెలవాగు వంతెన

- నీట మునిగిన గుండేటివాగు, ఎద్దెలవాగు వంతెనలు
- వేలేరుపాడు మండలంలో 16 గిరిజన గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

కుక్కునూరు: గత రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా గోదావరికి స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. సోమవారం సాయంత్రం భద్రాచలం వద్ద 25 అడుగుల ప్రవాహం ఉండగా మంగళవారం 32 అడుగులకు చేరింది. గోదావరి వరద ప్రవాహం పెరగడంతో కుక్కునూరు–దాచారం మధ్య ఉన్న గుండేటి వాగు వంతెన ముంపునకు గురైంది. దీంతో దాచారం, గొమ్ముగూడెం పంచాయతీలకు కుక్కునూరు మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం 32 అడుగుల వద్ద నిలకడగా ఉన్న గోదావరి వరద.. సాయంత్రం నుంచి తగ్గే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరద దోబూచులాడుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో గోదావరి వరద పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

అధికారులు అప్రమత్తం

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం 32 అడుగులకు పెరగడంతో వేలేరుపాడు మండలంలో కొయిదా రహదారిలోని ఎద్దెలవాగు వంతెన మంగళవారం నీట మునిగింది. దీంతో దిగువన ఉన్న 16 గిరిజన గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. దిగువ ప్రాంతంలోని కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్లగొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగుడెం, టేకూరు, సిద్ధారం, కుంకుడు కొయ్యలపాకలు, మరో ఐదు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వేలేరుపాడు తహసీల్దార్ జీ ఎలీషా మంగళవారం ఎద్దెలవాగు వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించి స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ఎద్దెలవాగు వద్ద నాటు పడవను ఏర్పాటు చేశారు. వీఆర్ఓ, పోలీసు సిబ్బందిని అక్కడ నియమించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వేలేరుపాడు ఆర్ఐ, దుర్గారావు, వీఆర్ఏ గణపతి తదితరులు పాల్గొన్నారు.



ఎద్దెలవాగులో ప్రవాహాన్ని పరిశీలిస్తున్న వేలేరుపాడు తహసీల్దార్ ఎలీషా

ఏకకాలంలో రెండు కోర్సులతో మెరుగైన ఉపాధి



మాట్లాడుతున్న డీన్ కె.రమేష్

తణుకు టౌన్: నూతన జాతీయ విద్యా విధానాన్ని దేశంలోనే మొట్ట మొదటిసారిగా మన రాష్ట్రంలో అమలు చేయడం సాహసోపేతమైన నిర్ణయమని ఆదికవి నన్నయ వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య కె.రమేష్ అన్నారు. మంగళవారం తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జాతీయ నూతన విద్యా విధానంపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ విద్యావిధానం ద్వారా ఒక విద్యార్థి సింగిల్, మేజర్ సిస్టమ్ ద్వారా తనకు నచ్చిన కోర్సును చదువుతూ మరో కోర్సును కూడా ఏకకాలంలో చదవచ్చన్నారు. దీని ద్వారా ఉపాధి అవకాశాలను పొందడంలో ఇంజనీరింగ్ విద్యార్థులతో డిగ్రీ విద్యార్థులు పోటీ పడవచ్చన్నారు. అంతేకాకుండా స్వయం ఉపాధి, యూజీసీ గుర్తింపు పొందిన ఆన్‌లైన్ కోర్సులు కూడా చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు అడిగిన పలు సందేహాలకు ఆచార్య రమేష్ సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, రీనా సాయి, వైస్ ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరి బాయి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నన్నయ వర్సిటీ గూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా అశోక్



ప్రిన్సిపాల్ అశోక్‌ను సత్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం: ఆదికవి నన్నయ్య వర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ నూతన ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ టి.అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఉన్న కొట్టే శ్రీరమేష్ స్థానంలో అశోక్ నియమితులయ్యారు. ఇటీవల కాలంలో నన్నయ్య క్యాంపస్‌లో విద్యార్థినులపై వేధింపులు, లైంగిక వేధింపుల వ్యవహారం వెలుగులోకి వచ్చాయి. ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై విచారణ ఇంకా పెండింగ్‌లో ఉంది. దీంతో ఇక్కడి పరిస్థితులను సరిదిద్దే క్రమంలో నన్నయ్య రాజమహేంద్రవరం క్యాంపస్‌లో గతంలో రిజిస్ట్రార్‌గా సేవలందించిన అశోక్‌ను ఇక్కడ నియమించినట్టు చెబుతున్నారు. అశోక్ గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేయడంతో పాటు, కాకినాడ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా కూడా పనిచేసిన అనుభవం ఉంది. అశోక్‌కు ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతానికి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి



సత్యన్నారాయణ మృతదేహం

ద్వారకాతిరుమల: విద్యుదాఘాతానికి గురై ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఐఎస్ రాఘవాపురం గ్రామానికి చెందిన పట్టపు వీరవెంకట సత్యన్నారాయణ (48) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన రైతు దాకారపు చంద్రరావు పొలంలో బోరుకు విద్యుత్ సక్రమంగా రాకపోవడంతో మరమ్మతుల కోసం సత్యనారాయణ మంగళవారం వెళ్లాడు. వైర్లు సరిచేస్తుండగా, విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుమారుడు నరసింహ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేదలకు ఉన్నత విద్య కల్పనే లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- సిద్ధాపురంలో ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి అభివృద్ధి పనుల ప్రారంభం



పాపారాయుడి విగ్రహావిష్కరణలో పాల్గొన్న జెడ్పీచైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: పేదలకు ఉన్నత విద్య అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ అన్నారు. మంగళవారం సిద్ధాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మనబడి నాడు–నేడు పథకంలో భాగంగా రూ.14 లక్షలతో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి జెడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనబడి నాడు–నేడు పథకంలో దశలవారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు ఆధునిక హంగులు సంతరించుకుంటున్నాయన్నారు. ఈ పథకంలో పనులు కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధులను పాఠశాల పేరెంట్ కమిటీ, టీచర్స్ కలసి ఖర్చు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఫేజ్–1లో జిల్లాలోని ప్రతి గ్రామంలో నాడు–నేడు పనులు పూర్తయినట్లు తెలిపారు. ఫేజ్–2లో మరిన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విద్య అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. నాడు–నేడు పథకంలో రెండు ఫేజ్‌లలో అభివృద్ధి చెందిన ప్రభుత్వ ప్రతి పాఠశాలలో డిజిటల్ విధానంలో స్మార్ట్ టీవీలు, ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ఏర్పాటు చెయ్యడమే కాకుండా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తూ పేద విద్యార్థులకు స్మార్ట్ బోధన అమలు చేస్తున్నారన్నారు. బొబ్బిలి వీరుడు తాండ్ర పాపారాయుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఆవిష్కరించారు.

అతిథులకు పౌర సన్మానం

ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ నౌడు అచ్యుతరామారావు, జానకి లక్ష్మి దంపతులు సిద్ధాపురం గ్రామ ప్రజల తరుపున జెడ్పీ చైర్మన్ పద్మశ్రీ దంపతులను, ఎమ్మెల్యే వాసుబాబును, ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యులు కొలుపూరి జయలక్ష్మీశ్రీనివాస్ దంపతులను, ఏఎంసీ చైర్మన్ మరడా మంగారావు, జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ విభాగం జాయింట్ సెక్రటరీ సంకు నాగేశు, సర్పంచ్ ఆదిరెడ్డి సత్యవతి తదితరులున్నారు.

అధికారం కోసం చంద్రబాబు పాకులాట

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు విమర్శ



పాలకొల్లు సమావేశంలో మాట్లాడుతున్న చీకటమిల్లి మంగరాజు

పాలకొల్లు అర్బన్: అధికారం కోసం చంద్రబాబు తహతహలాడుతున్నారని, అయితే దళిత, బహుజనుల ఓట్లతో సీఎంగా రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టడం ఖాయమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటమిల్లి మంగరాజు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని కొత్తకుళాయి చెరువుగట్టు వద్ద మంగళవారం నిర్వహించిన మాలమహానాడు అత్యవసర సమావేశంలో మంగరాజు మాట్లాడారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేదలకు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ఆయన రాజగురువు రామోజీ చేసిన అవినీతి అంతా, ఇంతా కాదన్నారు. చిట్ ఫండ్‌ల పేరుతో ప్రజాధనం నిలువుదోపిడీ చేసిన రామోజీకి శిక్ష పడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బాబుకు ఆయనకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రచారం చేస్తున్న పవన్ కల్యాణ్, బీజేపీ, వామపక్ష పార్టీలు అన్ని కలిసి పోటీ చేసినా సీఎం జగన్ వైపు ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా రుణపడి ఉన్నారన్నారు. సమావేశంలో మాలమహానాడు (పీవీరావు) రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం



ఆకివీడు: ఆకివీడు 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టం

ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజును సత్కరిస్తున్న నౌడు అచ్యుతరామారావు

నిడమర్రు: గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే విజయం సాధించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనకు నిదర్శనం అని ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు అన్నారు. మంగళవారం సిద్ధాపురం గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి జాతరకు హాజరై అనంతరం మాజీ సర్పంచ్ నౌడు జానకి లక్ష్మి నివాసంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 66 సర్పంచ్‌ల స్థానాలకు పోటీ జరిగితే ఏకగ్రీవాలతో కలుపుకుని 53 స్థానాల్లో, 1,062 వార్డులకు ఏకగ్రీవాలతో కలిపి 810 వార్డుల్లో వైస్సార్‌సీపీ మద్దతుదారులు విజయాలు సాధించారన్నారు. ఈ ఉప ఎన్నికల విజయాల బట్టి 80 శాతానికి పైగా ఓటర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనకు మద్దతు తెలుపుతున్నట్లే అన్నారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో భవిష్యత్ కార్యాచరణపై స్థానిక నేతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజును మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ నౌడు వెంకట అచ్యుతరామారావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ విభాగం జాయింట్ సెక్రటరీ సంకు నాగేశు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీను, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి మంత్రబుడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ఏలూరు టౌన్: కుటుంబ కలహాల వల్ల భర్త నుంచి విడిపోయి ఉంటున్న ఓ మహిళపై ప్రియుడు దాడి చేయడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు కొత్తూరు రోడ్డు గణేష్ కాలనీకి చెందిన నమ్మి హరి అనే యువకుడు రెండేళ్ల నుంచి ఆమెతో పరిచయం పెంచుకుని వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడు. అతనికి వివాహం కాగా ఇద్దరు పిల్లలు కూడా ఉండడంతో అతని ప్రవర్తన నచ్చకపోవటంతో మాట్లాడటం మానేసి, ఫోన్ నంబర్ బ్లాక్‌లో పెట్టింది. ఆమె ఒక నర్సింగ్ కాలేజీలో జీఎన్ఎం కోర్సును చదువుతోంది. ప్రతి రోజూ ఇంటికి వెళ్లే మార్గంలో ఆమెను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈనెల 14న ఆమె వెళుతూ ఉండగా రోడ్డుపై ఆపి నిన్ను పెళ్లి చేసుకుంటాను, నా భార్య పిల్లలను వదిలివేస్తానని చెప్పాడు. తనను పెళ్లి చేసుకోకుంటే నిన్ను, నీ తల్లిదండ్రులను చంపుతానని బెదిరించాడు. మంగళవారం మధ్యాహ్నం ఆమె ఒంటరిగా ఇంట్లో ఉండగా ఆకస్మికంగా ఇంటికి వచ్చి ప్లాస్టిక్ పైపులతో ఆమెను దారుణంగా కొట్టాడు. అడ్డువచ్చిన తల్లిని చంపుతానని బెదిరించి పారిపోయాడు. తీవ్ర గాయాలైన ఆమెను 108 వాహనంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈయూ కృషితోనే ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు

భీమవరం (ప్రకాశంచౌక్): పాత సర్వీస్ రూల్స్ ప్రకారం 1100 మంది ఆర్టీసీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతులు కల్పించనున్నట్లు ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ ఎ.అలీ, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు చెప్పారు. ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం మంగళవారం పట్టణంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రావు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి అల్లం నారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు జీవీ నరసయ్య, ఎండీ ప్రసాద్, ఎండీ అలీ, వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల భద్రత కోసం ఉద్యోగ సంఘాలు, మేనేజ్‌మెంటు కలసి చర్చించుకుని ఇచ్చిన 01/2019 సర్కులర్‌ను ఆర్టీసీ అధికారులు అన్ని చోట్ల యథావిధిగా అమలుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విలీనానికి ముందు ఉన్న ఆర్టీసీ రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారమే ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని యూనియన్ కృషి చేసిందన్నారు. దీని ఫలితమే ఉద్యోగులకు పదోన్నతులు రానున్నాయన్నారు. జోనల్ నాయకులు పి.అరుణ, ఎంఆర్‌పీ రాజు, టి.గోపాల్ పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి

నూజివీడు: ఆగిరిపల్లి మండలం వడ్లమాను సమీపంలోని సారా బట్టీలపై ఎస్సై నంబూరి చంటిబాబు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో సారా కాస్తున్న గండికోట విజయ్‌కుమార్, గుర్రం వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, సారా తయారీ పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

4 టన్నుల కోడి మాంసం వ్యర్థాల పట్టివేత

ఇద్దరిపై కేసు నమోదు



వ్యాన్‌ను పట్టుకున్న పోలీసులు

భీమడోలు: కొల్లేరులోని చేపల చెరువులకు మినీ వ్యాన్‌లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులపై భీమడోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన మండల ఆదినారాయణ అనే వ్యక్తికి భీమడోలు పంచాయతీ శివారు కొల్లేరు ప్రాంతమైన పెదలింగంపాడు ఏరియాల్లో చేపల చెరువులు ఉన్నాయి. తన మినీ వ్యాన్‌పై డ్రైవర్ జలసూత్రం రాజేష్‌తో కలిసి హైదరాబాద్‌లోని వివిధ చికెన్ దుకాణాల నుంచి నాలుగు టన్నుల కోడి మాంసపు వ్యర్థాలను సేకరించి వాటిని గట్టుచప్పుడు కాకుండా పెదలింగంపాడుకు తరలిస్తున్నాడు. మంగళవారం ఇలా నాలుగు టన్నుల కోడి మాంసం వ్యర్థాలను తరలిస్తుండగా, భీమడోలు వద్ద పోలీసులు వ్యాన్‌ను పట్టుకున్నారు. అందులోని కోడి మాంసం వ్యర్థాలను దూరంగా ఉన్న ప్రాంతంలో గోయ్యి తీసి పూడ్చి వేశారు. వ్యాన్‌ను సీజ్ చేశారు. వీఆర్వో మార్కేండేయులు పంచనామా నిర్వహించారు. మండల ఆదినారాయణరావు, డ్రైవర్ జలసూత్రం రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇద్దరు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించి, వారిని చంపుతానని బెదిరించిన నేరంపై యడ్లపల్లి శ్రీను, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. చిన్నంవారిగూడెంకు చెందిన బుద్దా పూజ భర్త చనిపోవడంతో పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నెల 12న పూజ, ఆమె తల్లిని అదే గ్రామానికి చెందిన యడ్లపల్లి శ్రీను, మరో నలుగురు కలిసి పక్క ఇంట్లోకి లాక్కునివెళ్లి, వివస్త్రలను చేసి అసభ్యకరంగా ప్రవర్తిచి ఇష్టం వచ్చినట్లుగా కొట్టారు. పూజ మెడకు ట్యూబ్ కట్టి ఉరివేసేందుకు ప్రయత్నించారు. పూజ కేకలు వేయడంతో చుట్టపక్కల రావడాన్ని గమనించిన ఐదుగురు అక్కడి నుంచి పారిపోతూ చంపుతామని బెదిరించారు. పూజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నగలు మాయం

ముదినేపల్లి రూరల్: స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఓ ఇంట్లో బంగారపు నగలు మాయమయ్యాయి. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన కె.రాంబాబు, ఆశాజ్యోతి దంపతులు పది రోజుల క్రితం బంగారు నగలను ఒక బ్యాగులో, వెండి వస్తువులు మరో బ్యాగులోనూ ఉంచి బీరువాలో దాచారు. సోమవారం బీరువా తెరిచి చూడగా నానుతాడు, రెండు జతల చెవిపోగులు, రెండు ఉంగరాలు, రెండు గొలుసులు కనిపించలేదు. 22 గ్రాముల బరువు ఉన్న నగల మాయంపై ఫిర్యాదు చేయగా ఎస్సై వెంకట కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆలయాల్లో విశేష పూజలు



చంద్రయాన్-3 విజయవంతం కావాలని ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: చంద్రయాన్ -03 విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం శంకర మఠంలో ఉమాచంద్రమౌళీశ్వరస్వామి, సర్వ మంగళ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 142 కోట్ల భారతీయుల ఆకాంక్ష నెరవేరాలని, భారతదేశం ప్రపంచానికి ఆదర్శం కావాలని కోరుతూ పూజాదికాలు చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి బాపయ్యశర్మ, ధూళిపాళ ఆదిత్య, వేమూరి సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం



ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణను సత్కరిస్తున్న గౌడసంఘం నాయకులు, చిత్రంలో మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు

తాడేపల్లిగూడెం: ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ మంగళవారం పట్టణానికి వచ్చిన సందర్భంగా గౌడసంఘం నాయకులు ఆయనను సత్కరించారు. సంఘాన్ని గుర్తించి ఆయనకు పదవి ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి రంగరాజు ఇంటికి వచ్చిన ఎమ్మెల్సీని కలిసి సంఘ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌వి.సోమేశ్వరరావు, రామగాని శ్రీనివాసు, గుట్టల దుర్గారావు తదితరులు ఉన్నారు.

మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు



దుర్గా భవాని (ఫైల్)

ఇరగవరం: మైనర్ బాలిక కనిపించడం లేదన్న తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. రేలంగి గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించడం లేదని తాత వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. ఈనెల 16వ తేదీ మనువరాలు దుర్గాభవానీ కనిపించడం లేదని, చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీయడం జరిగిందన్నారు. బాలిక ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

38 మందికి ఉచిత వైద్యసేవలు



తణుకులో ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సజ్జాపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 38 మందికి వైద్యసేవలు అందచేశారు. శిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు రోగులకు వైద్య సలహాలతోపాటు ఆహార నియమాలు తెలిపారు. ఈ సందర్భంగా రోగులకు బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి పేద రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, సహాయ కార్యదర్శి పెన్మెత్స సత్యనారాయణ రాజు, చేబ్రోలు సాధు, మద్దా అలివేలు మంగ, ఇవటూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఎరువులు

అత్తిలి: మండలంలోగల అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. ఎరువులను ముందుగానే పరీక్షించబడి నాణ్యతా ప్రమాణాలు ఉన్న ఎరువులు మాత్రమే రైతు భరోసా కేంద్రాల్లో పెట్టడం జరుగుతుందని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఎరువులను కొనుగోలు చేసుకోవాలన్నారు.

మణిపూర్ హింసాకాండ బాధాకరం

పాలకోడేరు : మణిపూర్‌లో జరిగిన హింసాకాండను నిరసిస్తూ పాలకోడేరు మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో యూపీఏ ప్రెసిడెంట్ గోపి సాల్మన్ రాజు అధ్యక్షతన పాలకోడేరు, గొల్లలకోడేరు గ్రామాల్లో మంగళవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన ఘటనలు బాధాకరమని, అటువంటి అల్లర్లు దేశవ్యాప్తంగా ఎక్కడా పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. ఆర్‌సీఎం ఫాదర్ తోట గాబ్రియేలు, బిషప్ మీకా, బిషప్ సత్యం, శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించి శాంతి భద్రతలను కాపాడి బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఆటపాటలతో బోధన

- అంగన్‌వాడీల్లో జన భగీరథకు శ్రీకారం
- పలు కేంద్రాల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం



పెంటపాడులో చిన్నారుల తల్లుల సమక్షంలో ఆటపాటలు నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: చిన్నారుల జీవితాల్లో మొదటి ఆరేళ్లు ఎంతో విలువైనవి. మూడేళ్లవరకు తల్లిఒడికి పరిమితమయ్యే పిల్లలు అనంతరం బయట ప్రపంచాన్ని అలవాటు చేసుకొనే ప్రయత్నాలు మొదలు పెడతారు. ఈ వయస్సులో చూపిన, విన్న అంశాల ఆధారంగా చిన్నారులు తన బుద్ధిని, తెలివితేటలను వికసింపజేసుకొంటారు. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో పాటు, చిన్నారులకు ఇష్టమైన ఆట, పాట, కథల ద్వారా వారి మనస్సులు హత్తుకొనేలా బోధించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఈ విధమైన విద్యా ప్రభావం పిల్లల్లో ప్రాథమిక స్థాయిలో కాకుండా ఉన్నత స్థాయిలో విద్యాప్రమాణాలు అందించేందుకు దోహదపడుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఇష్టమైన విధంగా బోధన చేసేందుకు జన భగీరథ కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కు బుక్స్, స్పోకెన్ ఇంగ్లీషు పుస్తకాల ద్వారా పిల్లలకు ఆటపాటలతో విద్యను ఎలా అందించాలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. పెంటపాడు మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా మినీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో చిన్నారులను ఆకర్షించేందుకు జగ భగీరథ కార్యక్రమం ప్రవేశపెట్టి ఆటపాటలతో విద్యాబోధన సాగిస్తున్నారు. ప్రతీ పాఠాన్ని ఏదో ఒక ఆట, పాట, కథలతో మిళితం చేసి నేర్పిస్తుండటంతో చిన్నారుల్లో ఆసక్తి నెలకొంది. తొలుత చిన్నారుల తల్లుల ద్వారా నేర్పి అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాల ద్వారా ఈ కార్యక్రమం చేయడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు హాజరు మిస్ కాకుండా వస్తున్నట్లు తెలిసింది. చిన్నారుల మనో వికాశం, వ్యక్తిత్వం పెంపొందించేందుకు పలు ఆటలు ఆడిస్తున్నారు. ఈ విధానం ఎంతో భాగుందన్న ప్రశంసలు పలు ప్రాంతాల్లో వినిపిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలు విద్యాబోధనపై ప్రతీ ఒక్కరూ అవగాహన చేసుకొని చిన్నారులను కేంద్రాలకు పంపించే విధంగా సహకారం అందించాలని కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆట, పాటలతో ఆడిస్తున్న కేంద్ర నిర్వాహకురాలు అనూరాధ

జన భగీరథ మంచి ఫలితాలనిస్తోంది



ఆరేళ్లలోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేసేలా చేపట్టిన జన భగీరథ కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. ఆరేళ్ల లోపు చిన్నారులకు ఆట, పాటలంటే ఎంతో నచ్చుతాయి. అలా ఆట పాటల ద్వారానే విద్యను మిళితం చేసి నేర్పిస్తున్నాం. ఈ కార్యక్రమం పట్ల అందరిలోనూ మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రశంసలు కూడా వస్తున్నాయి.

– జీజీబీ విజయలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పెంటపాడు-2

తల్లిదండ్రుల్లో చైతన్యం



తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకొచ్చేలా, చిన్నారుల మనస్సును హత్తుకొనేలా అంగన్‌వాడీలో ఆట, పాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నాం. జన భగీరథపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. చిన్నారులను కేంద్రాలకు పంపించాల్సిన ఆవశ్యకతను వివరించి చైతన్యం తీసుకొస్తున్నాం

– కె. శ్యామల, పెంటపాడు అంగన్‌వాడీ వర్కర్ల సంఘ అధ్యక్షురాలు

గుండె సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు



తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి ఆర్‌బీకేలో రోగులకు గుండె పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గుండె సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. విజయవాడ ఉషా కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి రైతు భరోసా కేంద్రంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అన్నవరం మాట్లాడుతూ గుండె సమస్యలను తొలి దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స పొందవచ్చన్నారు. అనంతరం ఉషా కార్డియాక్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వైవి.రావు 70మందికి గుండె వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అత్తంటి గంగాధరరావు, ఆలపాటి రామకృష్ణారావు, పంచాయతీ డీడీవో తల్లాప్రగడ రవిచంద్, సత్తిరాజు రాఘవేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే ప్రవేశం లేదు

జిల్లా ఎస్పీ రవిప్రకాష్ హెచ్చరిక



తణుకులో వాహనదారులు, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

తణుకు: వివిధ పనులపై తణుకు వచ్చే ద్విచక్రవాహనదారులు ఇకపై హెల్మెట్ ధరించకపోతే పట్టణంలోకి అనుమతించబోమని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణపై మంగళవారం తణుకు పట్టణంలో పలు ప్రధాన కూడళ్లలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. నో హెల్మెట్ నో ఎంట్రీ అనే నినాదంపై ఆయన అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ ఇకపై పట్టణంలోకి ప్రవేశించే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వినియోగంపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువశాతం తలకు గాయం కారణంగా మృతి చెందుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఆంజనేయులు, ట్రాఫిక్ ఎస్సైలు జానా సతీష్, హనుమంతరావు, బెన్నిరాజు, పట్టణ ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమం.. జగనన్న లక్ష్యం



ఎలక్ట్రికల్ ఏఈఈ, ఆకివీడు కొత్త సీఐలను సత్కరిస్తున్న దృశ్యం

ఉండి : ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఎలక్ట్రికల్ ఏఈగా ఎంపికైన ఎం.మాధవరాజు, ఆకివీడు సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణలను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసినా, నీచంగా మాట్లాడినా అడిగే నాథుడే లేడన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పాలన విజయంలో అహర్నిశలు శ్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మంచి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ఎప్పుడూ ముందుంటున్నారని అన్నారు. డీఏలు అందించడం, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి కావలసిన సౌకర్యాలు సమకూర్చడం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. అనంతరం మండలంలోని అన్ని శాఖల పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా విద్యాశాఖ మరింత మెరుగ్గా పనిచేసి డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. తాగునీటి కాలుష్యం, పశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన సెంటర్లలో ఉండి రైల్వేగేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వివిధ గ్రామాల్లో అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో ఏవీ అప్పారావు, వైస్ ఎంపీపీలు గుత్తుల కనక మహాలక్ష్మి, దత్తాల సుజాతరాణి, ఎస్సై కె.గంగాధరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వాండ్రంలో దళితుల నిరసన

ఉండి : వాండ్రంలో లూథరన్ చర్చ్‌పై దాడికి తెగబడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకుంటే రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలుపుతామని స్థానిక దళితులు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం వాండ్రంలో చర్చ్ వద్ద దళితులు ప్రార్థనలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గరికిముక్కుల సామేలు, కోనాల రాజేంద్ర, విప్పర్తి మహేష్, పాము మధు, మంద వర్మ, బందుల ఇశ్రాయేలు, మందా రూబేన్, గోరింకల ఏసేబు మాట్లాడుతూ గ్రామంలో ఇరువర్గాలకు జరిగిన కొట్లాటలో పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మూకుమ్మడిగా చర్చ్‌పై దాడికి తెగబడాల్సిన అవసరం ఏం వచ్చిందని వారు ప్రశ్నించారు. దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైనా సరే ఇప్పటిరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిష్టియన్ మైనారిటీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ దృష్టికి తీసుకువెళ్లామని వారంతా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఏఐఎల్‌సీ సినడు(జిల్లా) అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, ఏఐఎల్‌సీ కౌన్సిల్ సభ్యుడు పట్టా దేవరాజ్, యండగండి, తదితరులు దళితులకు సంఘీభావం ప్రకటించారు.

బీవీఆర్‌లో ఘనంగా జానపద నృత్య దినోత్సవం



బీవీఆర్ కళాకేంద్రంలో జానదప నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారులు



కోలాటం చేస్తున్న నృత్య బృందం

తాడేపల్లిగూడెం అర్బన్ : అంతర్జాతీయ జానపద నృత్య దినోత్సవం-2023 వేడుకలు కార్యక్రమాన్ని స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద నృత్య కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కళాకారులకు వేదికగా బీవీఆర్ కళాకేంద్రం పలు సేవలు అందించడం ఆదర్శనీయమన్నారు. అనంతరం కళాకారులకు జ్ఞాపికలు, ఆర్గనైజర్లు నాట్య ప్రవీణ ఆళ్ల శ్రీనివాస్, కోలాటం నృత్య బృందం నిర్వాహకులు పిటి వెంకటేశ్వర్లు, రేలా రే రేలా బృందం నిర్వాహకులు విజయవాడకు చెందిన గంటా నరేంద్రకుమార్, గరగల నృత్య బృందం నిర్వాహకులు వై తిలక్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు పుట్టినరోజు సందర్భంగా వేడుకలు నిర్వహించారు. పలువురు నాట్య కళాకారులు పాల్గొన్నారు.

'గూడెం'లో 43.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 43.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ మంగళవారం తెలిపారు. పెంటపాడులో 10 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

వాహనం ఢీ-వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. తాడేరు గ్రామానికి చెందిన బండారు గిరి వెంకటరావు పాల ప్యాకెట్లు కొనుగోలుచేసి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంకటరావు కాలికు తీవ్ర గాయమైంది. ఆయన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు హెడ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

పాలకోడేరు : తన భార్య, చిన్నకుమారుడు అదృశ్యంపై పెన్నాడ గ్రామానికి చెందిన అయినవల్లి ప్రతాప్ పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం ప్రతాప్‌కు, దీపికతో ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రతాప్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు తాను ఇంట్లో లేని సమయంలో చిన్న కుమారుడు హర్షిత్ (3) తో కలసి తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకి దొరకలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తణుకు టౌన్: ప్రజలందరూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తణుకు మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జీ వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు పైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురం, కొమ్మయిచెరువు గట్టు తదితర సచివాలయాల పరిధిలో పర్యటించి సిబ్బంది వెక్టార్ కంట్రోల్ హైజీన్, దోమల లార్వా డెన్సిటీ, కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ఉత్పత్తి స్థావరాలైన చిన్న చిన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు, తదతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

పరిశుభ్రతపై తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కళాశాలలో చదివే విద్యార్థులకు నిర్వహించిన ఈకార్యక్రమంలో తణుకు మున్సిపల్ సిబ్బంది తడి చెత్త, పొడి చెత్త వేరు చేయు విధానం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి వివిధ అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ విష్ణు వర్ధన్, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: కళ్లకు సోకే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వైద్యం చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిని సీహెచ్ ధనలక్ష్మి అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్పలో కొప్పర్తి వీరాస్వామి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఆప్తామిక్ అధికారి బి.రామకృష్ణ 65 మందికి కళ్ల పరీక్షలు నిర్వహించారు. వీరిలో కంట్లో శుక్లాలు ఉన్న 13 మందిని శస్త్ర చికిత్స కోసం ఏలూరులోని శంకర్ నేత్రాలయకు పంపించనున్నారు. మిగిలిన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిని ధనలక్ష్మి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పైబడిన వారు తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా చేస్తారని రవాణా ఖర్చులు, భోజన వసతి కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలామణి, పీహెచ్ఎన్ పుష్పవతి, స్టాఫ్‌నర్స్ కె.ఉష, వి.శ్యామల, ఏఎన్ఎం వీవీ సత్యవతి, ఎంపీహెచ్‌ఓ రాము, ఆశా కార్యకర్తలు జ్యోతి, విజయ కుమారి, కోటేశ్వరి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్.. రైతు సేవలో భేష్

నమోదుకు సెప్టెంబర్ 15 వరకు గడువు



రాయలంలో ఓ రైతుకు చెందిన పొలంలో పంట వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

భీమవరం అర్బన్: రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. సాగు ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రవేశపెట్టిన ఈ-క్రాప్ విధానం రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఆరుగాలం శ్రమించే కర్షకులకు మరింత మేలు చేసే విధంగా ఆర్‌బీకే సెంటర్లో కియోస్క్ ద్వారా నాణ్యమైన ఎరువులు, పురుగుమందులను, సబ్సిడీ విత్తనాలను బుక్ చేసుకున్న 48 గంటల్లో అందజేసే విధంగా చర్యలు తీసుకున్నారు.

ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో..

పంటల బీమా, నష్టపరిహారం చెల్లింపు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, అందుబాటులో ఎరువులు, పురుగుమందులు, పెట్టుబడి సాయం అందించడం, వైఎస్సార్ యంత్ర సేవా పథకం అమలు, సున్నా వడ్డీ పంట రుణాలు అందించడం, మెట్టలో ఉచిత విద్యుత్, ఉచిత బోర్లు ఇలా ఎన్నో రైతుల సంక్షేమానికి రూపొందించిన పథకాలు ఈ-క్రాప్ నమోదుతో సులభంగా అందుతాయి. ఈ-క్రాప్‌లో భాగంగా ఆర్‌బీకే స్థాయిలో ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. దీని వల్ల పంట అమ్ముకునే సమయంలో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడేళ్లుగా పంటల బీమాను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ఆర్‌బీకేల్లో నమోదు

ఈ-క్రాప్‌లో భాగంగా రైతులు, కౌలు రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలి. అనంతరం ఆయా ప్రాంతాల్లో రైతుల సాగు విధానాన్ని వ్యవసాయాధికారులు పరిశీలించి పంట వివరాలు నమోదు చేస్తారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలను సెప్టెంబర్ 15 లోగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. భీమవరం మండలంలో 13 వ్యవసాయాధారిత గ్రామాల్లోని 7 వేల ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేపట్టారు. ఏటా భారీ వర్షాలు, తుపానుల వల్ల కొన్ని ప్రాంతాలలో పంట దెబ్బతినే పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ఎంతో మేలు చేకూరుతుంది.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట దెబ్బతింటే ఈ-క్రాప్ నమోదుతో పంట నష్టపరిహారం నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తున్నారు. ఈ విధానం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం రైతులకు చేకూరుతుంది. కాళ్లు అరిగేలా వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరిగే పని ఉండదు. ప్రభుత్వం ఇచ్చే ప్రతిఫలం పక్కాగా రైతులకు అందుతుంది.

– కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్, బేతపూడి

రైతులకు ఎంతో మేలు

ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రతి రైతు పండిస్తున్న పంట వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలి. ఈ-క్రాప్ నమోదు సెప్టెంబర్ 15 వరకు మాత్రమే నమోదు చేస్తారు. ఇప్పటికే మండలంలో 1500 ఎకరాల్లో పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశాం. మిగిలిన పంటల వివరాలను రైతులు త్వరగా నమోదు చేయించుకోవాలి.

– నిమ్మల శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి, భీమవరం

• సృజన

హ్యాపీ స్పేస్


• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లై, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, హైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్ తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...
• నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రెన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.


అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి
ఫొటో: మోహనాచారి

న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత 'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం


• మాన్య

పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్లలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.





బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ల మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్లు ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లల్లోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వి మేళా, అక్షయ్‌కల్ప్ రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు

సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

యూత్ పల్స్



ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్‌బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారి పోటర్' సిరీస్‌లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలెవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.



రియల్ చాలెంజర్... జెమిని

ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్‌- జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ-మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

